# ప్రవేశిక

నేను బి.ఎ. చదివే రోజుల్లో ఓరియంటల్ కళాశాలలో ఎక్కువగా ప్రాచీన సాహిత్యాన్ని అధ్యయనం చేశాను. డిగ్రీ చివరి సంవత్సరంలో వివిధ అభ్యుదయ సంస్థల, మిత్రుల పరిచయం వల్ల ఆధునిక సాహిత్యం అందులోనూ అభ్యుదయ సాహిత్యంపట్ల ఆకర్షితుణ్ణయ్యాను. గురజాడ, కందుకూరి, శ్రీ.శ్రీ, చలం, కొడవటిగంటి, ఆరుద్ర కుటుంబరావు లాంటి రచయితల కవితలు, కథలు, నవలలు, వ్యాసాలు చదివాక నాలో సామాజిక స్పృహకు సంబంధించిన అవగాహనలు పెరిగాయి.

శ్రీ వేంకటేశ్వర యూనివర్శిటిలో ఎం.ఏ., చదివే రోజుల్లో ఆధునిక సాహిత్యాన్నే ఐచ్ఛికాంశంగా ఎన్నుకున్నాను. దీంతో ఎం.ఏ. పూర్తవగానే పరిశోధన చేయాలని అనుకొన్నాను. అదే సమయంలో శ్రీ వేంకటేశ్వర యూనివర్శిటిలో తెలుగు అధ్యయన శాఖలో పిహెచ్.డి.లో ప్రవేశించాను. అప్పుడు ఆధునిక సాహిత్యంలో మార్క్సిస్ట్ ఆలోచనా దృక్పథంతో రచనలు చేసిన కొడవటిగంటి కుటుంబరావు కథల్ని చదివి వాటిపై పరిశోధన చేయాలనుకున్నాను. నా ఈ కోరికను మాగురువు గారైన డా॥ కె.వెంకటరమణ గారి దగ్గరా, ఆచార్య మేడిపల్లి రవికుమార్ గారి దగ్గర వ్యక్తం చేశాను. వారు నన్ను ప్రోత్సహించారు. డా॥ కె.వెంకటరమణ గారి పర్యవేక్షణలో **'కొడవటిగంటి కథలు–ఆర్థిక జీవన ప్రతిఫలనం'** అనే అంశాన్ని పరిశోధనాంశంగా తీసుకుని పూర్తిచేశాను.

తెలుగు కథా సాహిత్యంలో నాటి నుండి నేటివరకూ అనేకమంది కథకులు, అభ్యుదయ వాదులు, ప్రసిద్ధ రచయితలెందరో వున్నారు. వారిలో తనకంటూ ఒక ప్రత్యేకతనూ, చెరగని ముద్రను వేసుకున్న మార్క్సిస్టు మేధావి కొడవటిగంటి కుటుంబరావు. సమాజ గమనాన్ని ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ ఆయా

అంశాల్నే కథా వస్తువులుగా స్వీకరిస్తూ సమాజాన్ని మార్చాలని ప్రయత్నించిన తొలితరం అభ్యుదయవాది కొడవటిగంటి. ముఖ్యంగా కొడవటిగంటి కుటుంబరావు మధ్యతరగతి జీవనాన్నే నేపథ్యంగా తీసుకుని రచనా ప్రపంచాన్ని కొనసాగించాడు. కొడవటిగంటి కుటుంబరావుపై కార్ల్‌మార్క్స్ వ్రాసిన 'కాపిటల్' గ్రంథప్రభావం అధికమని స్వయంగా ఆయనే చెప్పుకున్నాడు. అప్పటికే ప్రపంచం మొత్తం ఆర్థిక సంక్షోభంతో అవస్థలు పడుతోంది. గతంలో కొడవటిగంటి కథలు, నవలలపై ఎన్నో పరిశోధనలు వచ్చినా ఆయన వ్రాసిన ఆర్థిక అంశాల్ని కేంద్రంగా చేసుకుని రాలేదు. అందుకే 'కొడవటిగంటి కథలు - ఆర్థిక జీవన ప్రతిఫలనం' అనే అంశాన్ని నేను పరిశోధనకు స్వీకరించి సిద్ధాంత గ్రంథాన్ని తయారు చేశాను.

'కొడవటిగంటి కథలు - ఆర్థిక జీవన ప్రతిఫలనం' అనే నా పరిశోధనాంశాన్ని ఐదు అధ్యాయాలుగా విభజించి రూపొందించాను.

**'కొడవటిగంటి జీవన రేఖలు - సాహిత్యం'** అనే ఒకటో అధ్యాయంలో రచయిత జీవితాన్ని, సాహితీ జీవితాన్ని పరిచయం చేశాను.

**'కొడవటిగంటి కథలు - వైయుక్తిక ఆర్థిక ప్రతిఫలనం'** అనేది రెండవ అధ్యాయం. ఆర్థిక స్థితి వ్యక్తి మీద తప్పక ప్రభావాన్ని చూపుతుంది. సహజ ఉపరితలమంతా ఆర్థిక చట్రంపై ఆధారపడి వుంటుంది. కాబట్టి మనిషి సమాజంలో కీలక పాత్ర ధారి అవుతాడు. ఈ నేపథ్యం నుండి వివాహం, సంపాదన, అక్రమ సంపాదన, వ్యాపారం, ఉద్యోగి, నిరుద్యోగి అనే విభాగాలుగా విభజించి ఆయా పరిస్థితుల్లో డబ్బుకూ, వ్యక్తికీ మధ్య గల ప్రతిఫలనాన్ని ఈ అధ్యాయంలో పరిశీలించాను.

**'కొడవటిగంటి కథల్లో కుటుంబం - ఆర్థిక ప్రతిఫలనం'** అనే మూడవ అధ్యాయంలో సాంఘిక వ్యవస్థకు ప్రాథమిక విభాగమైన కుటుంబం, డబ్బు

మూలంగా ఎదురయ్యే సమస్యల్ని చర్చించడం జరిగింది. కుటుంబం నేపథ్యంగా మధ్యతరగతి కుటుంబం, పొదుపు, అప్పులు, దారిద్ర్యం, బంధుత్వాలు, స్నేహాలు అనే విభాగాల క్రింద విభజించుకుని ఆయా పరిస్థితుల్లో డబ్బు కుటుంబాల మధ్య గల ప్రతిఫలనాన్ని ఈ అధ్యాయంలో పరిశీలించాను.

**'కొడవటిగంటి కథల్లో సామాజిక వ్యవస్థ-ఆర్థిక ప్రతిఫలనం'** అనే నాల్గవ అధ్యాయంలో సామాజికవ్యవస్థలో ఆర్థిక పరిస్థితుల్ని, వివిధ ఆర్థిక వ్యవస్థల తీరుతెన్నుల్ని పరిశీలించడం జరిగింది. ఈ క్రమంలో పెట్టుబడిదారి ఆర్థిక వ్యవస్థ, యుద్ధకాలం నాటి ఆర్థిక స్థితిగతులు, ఆర్థిక దోపిడీ లాంటి అంశాల్ని, కొడవటిగంటి కోరుకున్న సామ్యవాద ఆర్థిక వ్యవస్థకు చెందిన అంశాల్ని కూడా ఈ అధ్యాయంలో పొందుపరచాను.

**'కొడవటిగంటి కథలు - సామాజిక జీవన ప్రతిఫలనం'** అనే ఐదో అధ్యాయంలో సామాజిక జీవితంతో ముడిపడివున్న అనేక అంశాల్ని వైయక్తిక అంశాలు,సామాజిక స్వరూపం, వివాహం, మధ్యతరగతి మనస్తత్వం అనే నాల్గు విభాగాలుగా చేసుకుని పరిశీలించడం జరిగింది. పైన పేర్కొన్న విభాగాల్ని మరికొన్ని ఉప విభాగాలుగా చేసి సమాజంపై కొడవటిగంటి ఆలోచనా దృక్పథాన్ని, సామాజిక ప్రతిఫలనాన్ని క్షుణ్ణంగా పరిశీలించాను.

ఈ అధ్యాయాల అనంతరం **సింహావలోకనం**లో ఈ పరిశోధనలో చర్చించి, పరిశీలించి తేల్చి చెప్పిన విషయాల్ని వివరించాను.

సింహావలోకనం తర్వాత సిద్ధాంత గ్రంథం చివరిలో నా పరిశోధనకు ఉపయోగపడ్డ గ్రంథాలను అకారాది క్రమంలో పొందుపర్చడం జరిగింది.

చివర అనుబంధంలో నా పరిశోధనా సమయంలో కొడవటిగంటి సాహిత్యంపై వివిధ సందర్భాల్లో ప్రచురించిన నా పరిశోధనా పత్రాల్ని జతచేయడం జరిగింది. దీంతోపాటు కొడవటిగంటి జీవితంలోని ముఖ్య సంఘటనలకి చెందిన అరుదైన చిత్రాల్ని కూడా ఇక్కడే పొందుపరిచాను.